## ఊరకుంటను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్


ఊర చెరువును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీలోని ఊరకుంటను సోమవారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీ సమీపంలోని ఊరకుంటలోకి భారీగా వరద నీరు చేరింది. కాలనీకి వెళ్లే రోడ్డు నీటిలో మునిగిపోయింది. దీంతో కాలనీవాసులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ అదనపు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కాలనీవాసులతో కలిసి ఊరచెరువును సందర్శించి సమస్యను పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే పలు నిర్మాణాలు, రోడ్డు ఉండడంతో నీటిలో మునిగిందని గుర్తించారు. శ్రేయాస్ కళాశాల సమీపంలోని కుంటను పరిశీలించారు. చెరువు కట్టకింద ఉన్న మారుతినగర్, రాఘవేంద్రనగర్ కాలనీలోకి ఊట నీరు వస్తుందని పలువురు కాలనీవాసులు అదనపు కలెక్టర్‌కు తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హరికుమార్, మారుతినగర్ కాలనీ అధ్యక్షుడు భాస్కర్‌చారితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.


కాలనీవాసుల సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

## కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు

వనస్థలిపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండు నెలల్లో ప్రశాంత్ నగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి స్థానికులకు హామీ ఇచ్చారు. వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్ సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ప్రశాంత్‌నగర్‌లోని కనకదుర్గమ్మ దేవాలయం ముందు సీసీ రోడ్డు వెడల్పు చేయడంతో పాటు సీనియర్ సిటిజన్ భవనం నిర్మిస్తామని అన్నారు. ఎఫ్‌సీఐ కాలనీలోని ఖాళీ స్థలాల నుంచి వస్తున్న వరదనీరును అరికట్టడానికి పది ఫీట్ల వరకు ఎల్‌టైపు గోడ నిర్మాణం, విష్ణుథియేటర్ వెనుకాల ఉన్న పార్కును అభివృద్ధి చేస్తానని, ప్రశాంత్‌నగర్‌లో నూతన డంపింగ్ యార్డును ఏర్పాటు చేయిస్తానని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, జలమండలి డీజీఎం రాజ్‌గోపాల్, డీఈ రఫీ, జీహెచ్‌ఎంసీ ఏఈ విగ్నేశ్వరీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రాక్‌టౌన్‌కాలనీ సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌రెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ రాక్‌టౌన్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యుల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం కాలనీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాలనీవాసి, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మధుసూదన్‌రావు, యోగా గురువు మధుసూదన్‌రెడ్డి విచ్చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రస్తుత పాలకవర్గం ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి ఆదాయం, వ్యయాలు, ఇతరత్రాలను గురించి చర్చించారు. కాలనీ సొసైటీ సభ్యుల విన్నపం మేరకు కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా మూడు నెలల పాటు టీచింగ్ చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుతో పాటు కాలనీలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా కృషి చేసిన సివరేజ్ కార్మికులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. త్వరలో ఐదుగురితో కూడిన నూతన పాలక వర్గానికి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నామని కాలనీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి తెలిపారు. సభ్యత్వం ఉన్న కాలనీవాసులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాలనీ ఉపాధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, కార్యదర్శి జైపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సూర్యనారాయణ, ట్రెజరర్ నాగరాజు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## బృందావన్ మిడోస్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక


నూతన అధ్యక్షుడు శశికాంత్

వనస్థలిపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బృందావన్ మిడోస్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా రెండవసారి పొనుగుపాటి శశికాంత్, ప్రధాన కార్యదర్శిగా వి.వేణు, ఉపాధ్యక్షులుగా ఎస్.జగన్ మోహన్ చారి, సంయుక్త కార్యదర్శి ఎం.రాజు, కోశాధికారి రవితేజ, కార్యవర్గ సభ్యులుగా బి.అరుణ్, పి.రమేష్, కె.కిరణ్, ఎం.పుల్లా రెడ్డి, ఎం.రఘుమారెడ్డి, ఆర్.సురేష్, ఎస్.రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు శశికాంత్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. తమ ఎన్నికకు కృషి చేసిన కాలనీవాసులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


సౌభాగ్యనగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

## సౌభాగ్యనగర్ కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభం

ఎల్‌బీనగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): 'మీరు వేసిన ఓటు వల్లే మీకు సేవ చేసే భాగ్యం నాకు కలిగింది'అని కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని సౌభాగ్యనగర్ కాలనీలో మణిదేవర నివాస్ సమీపంలో సీసీ రోడ్డు వేయించేందుకు రూ. 10.50 లక్షలను కార్పొరేటర్ మంజూరు చేయించి పనులు చేపట్టారు. పనులు పూర్తికావడంతో కాలనీ వాసులతో కలిసి సోమవారం సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, మాదవరం కిరణ్‌కుమార్, వెంకట సురేష్, ఈశ్వర్‌రెడ్డి, పోశెట్టి సోమశేఖర్, రామకృష్ణ, శ్రీకాంత్, చౌదరి, చంద్రమౌళి పాల్గొన్నారు.

## వ్యవసాయ, సహకార శాఖ సెక్రెటరీకి సన్మానం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ, సహకార శాఖ నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన కె.సురేంద్ర మోహన్(ఐఏఎస్)ను సచివాలయంలో సోమవారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పండ్లబుట్టను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించబోయే మార్కెట్ నిర్మాణం విషయంలో త్వరగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

- అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి)

# జడ్పీ రహదారికి మహర్దశ

● వంద ఫీట్ల వెడల్పు కోసం నోటీసులు జారీ ● బీఎన్‌రెడ్డి చౌరస్తా నుంచి భూపేష్‌గుప్తానగర్ వరకు విస్తరణ

చంపాపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని జడ్పీ రహదారికి మహర్దశ రానుంది. ఆ రహదారిపై తరచూ ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. డివిజన్‌లోని భూపేష్‌గుప్తానగర్ కాలనీ, శ్రీరమణకాలనీ, హుడాభారతీ కాలనీ, ఇంద్రప్రస్థకాలనీ, వెంకటేశ్వరకాలనీ, అగ్రికల్చర్‌కాలనీ, డీఆర్‌డీఎల్ కాలనీ, ఉర్మిలానగర్ కాలనీ, తెలంగాణ చౌరస్తా మీదుగా డీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వరకు రోడ్డును 100 ఫీట్లకు విస్తరించనున్నారు. ప్రస్తుతం 60ఫీట్ల వెడల్పుతో ఉన్న జడ్పీ రహదారిపై నుంచి ఇటు ఎయిర్‌పోర్టుకు అటు సాగర్ ప్రధాన రహదారి చేరుకునేందుకు వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపైన వారంతపు సంతలు, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తుండడంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్ జామ్ అవుతోంది.

### వంద ఫీట్ల రహదారి కోసం నోటీసులు

భూపేష్‌గుప్తానగర్ కాలనీ(హిందూ శ్మశానవాటిక) నుంచి బీఎన్‌రెడ్డి చౌరస్తా వరకు ఉన్న జడ్పీ రహదారిని వంద ఫీట్ల(30మీటర్లు) రహదారిగా విస్తరించేందుకు జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ -4 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా జడ్పీ రహదారి ఇరువైపులా వంద ఫీట్ల లోపు ఉన్న గృహ, వాణిజ్య భవనాల యజమానుకు ఇటీవల జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు మొదటి నోటీసులు అందజేశారు. గృహాలు, వాణిజ్య భవనాలు ఎంత మేరకు(గజాలు) తొలగించవలసి వస్తుందో సూచిస్తూ నోటీసులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం భూమి పరిహారం ఇచ్చేందుకు వారు సిద్ధంగా ఉన్నట్లు నోటీసులో పేర్కొన్నారు. భూమి పరిహారం బదులుగా టీడీఆర్ లేదా ఉన్న స్థలంలో సెట్‌బ్యాక్ నిర్మాణం లేదా అదనంగా మరో అంతస్తు నిర్మించుకునేందుకు టౌన్ ప్లానింగ్ వారు అవకాశం కల్పిస్తున్నారు. భూమి కోల్పోయే యజమానులకు రెండు నోటీసులు ఇచ్చి వారి నుంచి సమాధానం తీసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులు ముందుకు సాగనున్నారు. ఇప్పటికే రహదారి వెంట ఉన్న గృహ, వాణిజ్య భవనాల నిర్మాణాల కోసం వంద ఫీట్ల రహదారిని సూచిస్తూ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పర్మిషన్లు జారీ చేస్తున్నారు.

### టీకేఆర్ కమాన్ నుంచి నందీహిల్స్ వరకు..

టీకేఆర్ కమాన్ నుంచి భూపేష్‌గుప్తానగర్ కాలనీ, నందనవనం, హనుమాన్‌నగర్ కాలనీ, టీకేఆర్ కాలేజ్ మీదుగా మీర్‌పేట మున్సిపాలిటీలోని నందీహిల్స్ బస్టాప్ వరకు వంద ఫీట్ల రహదారి విస్తరణకు జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఈ రహదారి విస్తరణ కోసం గృహ, వాణిజ్య భవనాల యజమానులకు త్వరలో నోటీసులు అందజేయనున్నట్లు సమాచారం. ఈ రహదారి నిర్మాణ విస్తరణ పనులు పూర్తి అయితే ప్రశాంత్‌హిల్స్ నుంచి టీకేఆర్ కమాన్ మధ్య వాహనాల రాకపోకలు అధికం కానున్నాయి.


హస్తినాపురం డివిజన్ డీఆర్‌డీఎల్ కాలనీలో ఇరుకుగా ఉన్న జడ్పీ రహదారి

### తొలగనున్న వాహనదారుల కష్టాలు

జడ్పీ రహదారి విస్తరణతో వాహనదారుల కష్టాలు తొలగిపోనున్నాయి. జడ్పీ రహదారిపై తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. రహదారి విస్తరణ వల్ల వాహనదారుల ప్రయాణం సాఫీగా కొనసాగుతుంది. ఎయిర్‌పోర్టుతో పాటు సాగర్‌రోడ్ వైపు వెళ్లేందుకు వాహనదారులకు అనువుగా ఉంటుంది.

- రాజశేఖర్‌రెడ్డి, విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీ, హస్తినాపురం

### భూ యజమానులకు నోటీసులు జారీ

హస్తినాపురం డివిజన్‌లోని జడ్పీ రహదారి విస్తరణ కోసం ప్లానింగ్ సిద్ధం చేశాం. రహదారిని వంద ఫీట్ల వరకు విస్తరించేందుకు పై అధికారుల ఆదేశాల మేరకు ప్లానింగ్ కొనసాగిస్తున్నాం. ఇప్పటికే గృహ, వాణిజ్య భవనాల యజమానులకు మొదటి విడత నోటీసులు అందించాం. మరికొందరికి నోటీసులు అందించాల్సి ఉంది. రెండో నోటీసు అందిన తర్వాత భూ యజమానులు పరిహారం కోసం నోటీసులో పేర్కొన్న విధంగా మూడు అంశాలలో దేనికి అంగీకరిస్తారో తెలుపాల్సి ఉంటుంది.

- ప్రతాప్, ఏసీపీ, టౌన్ ప్లానింగ్, ఎల్‌బీనగర్ సర్కిల్, జీహెచ్‌ఎంసీ

## రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు పారబోస్తే కఠిన చర్యలు

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధానరోడ్డుకు ఇరువైపులా చెత్త, ఇతర వ్యర్థాలు పారబోసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశించారు. మన్సూరాబాద్ డివిజన్ డంపింగ్‌యార్డుకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా భారీగా పారబోసిన చెత్త, ఇతర వ్యర్థాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాటి కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి చొరవతో ఉదయం, సాయంత్రం వేళల్లో అందరికీ ఉపయోగకరంగా ఉండేలా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, హరితహారంలో భాగంగా ఇరువైపులా మొక్కలు నాటించడంతో పాటు సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేయించామని గుర్తు చేశారు. కానీ నేడు అక్కడ సీసీ కెమెరాలను తొలగించి చెత్తాచెదారం, రసాయనాలు పారబోస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వ్యర్థాలను తొలగించి శుభ్రపర్చడంతో పాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వ్యర్థాలు పారబోయకుండా చూడాలని ఫోన్‌లో అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పోచబోయిన జగదీష్‌యాదవ్, యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, యాదగిరి నేత, జడ్జెస్‌కాలనీవాసులు ఉన్నారు.


రోడ్డు పక్కన పారబోసిన వ్యర్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, జక్కిడి రఘువీర్‌రెడ్డి

## చంద్రశేఖర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు కృషి

● మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో దుండగుడి కాల్పుల్లో మరణించిన బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం తరుపున తగిన ఆర్థిక సాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీగౌడ్ అన్నారు. బాధిత కుటుంబాన్ని సోమవారం రాత్రి మధు యాష్కీగౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ చిత్ర పటానికి ఆయన పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన చంద్రశేఖర్ మృతిచెందడం ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. పెట్రోల్ బంకులో కాల్పులకు సంబంధించిన సీసీ ఫుటేజీలను ఇప్పించాలని చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు మధు యాష్కిగౌడ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, మార్కెట్ కమిటీ డైరక్టర్లు పాశం అశోక్‌గౌడ్, నేలపాటి రామారావు, నాయకులు గణేష్‌రెడ్డి, వినయ్ పటేల్, గోపీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, డేరంగుల కృష్ణ, రమేష్‌నాయక్, అంతటి శ్రీనివాస్, రేణుగౌడ్, కొండోజు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, అనసూయ, భాను తదితరులు పాల్గొన్నారు.


చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మధుయాష్కీగౌడ్

## న్యూమధురానగర్ కాలనీ కార్యవర్గం ఎన్నిక


న్యూమధురానగర్ కాలనీ కార్యవర్గం ప్రతినిధులు

సరూర్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని 5వ డివిజన్ పరిధిలో గల న్యూమధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దెంది రాంరెడ్డి, గౌరవాధ్యక్షులుగా పులికంటి పుల్లారెడ్డి, ఐతగోని నర్సింహాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కొట్టం సోమయ్య యాదవ్, కోశాధికారిగా ఎమిరెడ్డి యాదిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నాగిళ్ల ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులుగా బట్టు శ్రీశైలంయాదవ్, సిద్దగోని తిరుపతయ్యగౌడ్, కొత్త వెంకటేష్, చిలుకూరి రవీంద్రాచారి, కార్యదర్శులుగా వాళదాసు యాదయ్యగౌడ్, శీల రాకేష్, నేనావత్ బంతిలాల్, సలహాదారులుగా ఇస్లావత్ గోపాల్‌నాయక్, బైరు అనంతరెడ్డి, మిట్టమీది శ్రీనివాస్‌రెడ్డి, హెచ్.రామకోటేశ్వరరావు, పిరికేటి విఠలాచారి, సందాడి రామకృష్ణారెడ్డిలను ఎన్నుకున్నట్టు అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు.

## నేటి నుంచి తెలంగాణ మున్సిపల్ వర్కర్స్- ఎంప్లాయీస్ యూనియన్ మహాసభలు


సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

హయత్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మన్నెగూడలోని చలసాని వారి కల్యాణ మండపంలో జరగనున్న తెలంగాణ మున్సిపల్ వర్కర్స్- ఎంప్లాయీస్ యూనియన్ 5వ మహాసభల ఏర్పాట్లను సోమవారం సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14, 15వ తేదీలలో సమావేశాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు రాగన్నగూడ వార్డు కార్యాలయం నుంచి కార్మికులు ర్యాలీగా సభా వేదికకు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షులు శ్రావన్‌కుమార్, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్, జగదీష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సల్ బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గం ఎన్నిక


బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గం సభ్యులు

చంపాపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని రోషన్‌దౌలా కాలనీలో సోమవారం యూనివర్సల్ బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చర్చి అధ్యక్షుడిగా డి.ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా పి.రంగయ్య, కార్యదర్శిగా ఎస్.కృపాకర్, జయింట్ సెక్రటరీగా ఏ.సుందరరాజు, కోశాధికారిగా ఎం.దిలీప్, మహిళా అధ్యక్షురాలుగా ఈ.మరియమ్మ, కార్యవర్గ సభ్యులుగా ఎస్.జాన్, ఏ.సునీల్‌కుమార్, జి.జోషి, సండే స్కూల్ డైరెక్టర్‌గా జె.వెంకటేష్, యూత్ డైరెక్టర్‌గా జె.డానియల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలలో హైదరాబాద్ యూనివర్సల్ బాప్టిస్ట్ చర్చి పెద్దలు రిటైర్డ్ ఐపీఎస్ జి.ఆల్ఫ్రెడ్, రిటైర్డ్ ఐఏఎస్ కేఆర్‌డబ్ల్యూ.యేసుదాస్, ఆర్.గిడియోన్, ప్రేమ్‌కుమార్, బెనెహర్, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వినోద్‌కుమార్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది సల్ల వినోద్‌కుమార్ నియమితులయ్యారు. వినోద్‌కుమార్‌కు అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ దుగుంట్ల శ్రీధర్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ బీసీ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర కన్వీనర్ శ్రీధర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దీకొండ రవీందర్, మాధవరెడ్డి, సందీప్‌గౌడ్, భరత్‌గౌడ్, మల్లేష్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.


వినోద్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ శ్రీధర్ తదితరులు

## మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

కొత్తపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య వివరించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 111 మంది మద్యం ప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సోమవారం పిల్లల ట్రాఫిక్ ట్రైనింగ్ పార్కు లెక్చర్‌హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. సీసీ కెమెరాల్లో నమోదైన రోడ్డు ప్రమాదాల క్లిప్స్ ప్రదర్శిస్తూ మద్యంమతులో వాహనాలు నడిపిన వారి పరిస్థితిని వివరించారు.

## వచ్చే నెల 22న పుట్టపర్తికి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులు

చాదర్‌ఘాట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి పుట్టపర్తికి సూపర్ లగ్జరీ బస్సులను నడపనున్నట్లు హైదరాబాద్-1 డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. 36 సీట్లతో కూడిన నాన్ ఏసీ సూపర్ లగ్జరీ బస్సు వచ్చే నెల 22న మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి సాయంత్రం 6గంటలకు బయల్దేరి మరుసటి రోజైన 23వ తేదీన తెల్లవారుజామున 4గంటలకు పుట్టపర్తికి చేరుకుంటుందన్నారు. తిరిగి సాయంత్రం 6గంటలకు పుట్టపర్తి నుంచి బయల్దేరి మరుసటి రోజైన 24వ తేదీన తెల్లవారుజామున 4గంటలకు మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌ను చేరుకుంటుందని ఆయన వివరించారు. చార్జి ఒక్కొక్కరికి రూ.2,100 వసూలు చేయనున్నారు. టికెట్ బుకింగ్ కోసం మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, సికింద్రాబాద్‌లోని జూబ్లీబస్‌స్టేషన్, దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్‌లను, సమీపంలో ఉన్న బుకింగ్ ఏజెంట్లను, ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.9440566379, 7382824794లలో సంప్రదించవచ్చని డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు.

## ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారం.. యువకుడి అరెస్ట్

సైదాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో ఫోన్‌లో అశ్లీల వీడియోలు చూస్తూ ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైదాబాద్ పరిధిలో మూడో తరగతి చదువుతున్న కూతురు(8), కుమారుడి(7)తో కలిసి తల్లిదండ్రులు ఉంటున్నారు. 20 రోజుల క్రితం తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లగా పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి వచ్చారు. చైతన్యపురిలో మొబైల్‌షాపులో పనిచేసే కిరణ్(26) గంజాయి మత్తులో బాలికను తన ఇంట్లోకి పిలిచాడు. అక్క, తమ్ముడు ఇద్దరూ అతడి ఇంటికి వెళ్లగా చిన్నారిని బెదిరించి యువకుడు అత్యాచారం చేశాడు. బాలిక అనారోగ్యానికి గురికావడంతో తల్లి ఆరా తీయగా కుమారుడు జరిగిన అకృత్యాన్ని వివరించాడు. తల్లి ఈ విషయాన్ని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లింది. సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## కారు ఢీకొని డీసీఎం డ్రైవర్ మృతి

హయత్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని డీసీఎం డ్రైవర్ మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జనగాం జిల్లా పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన మజ్జిగ రమేష్(40) భార్య రజిత, ఇద్దరు పిల్లలతో కలిసి పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డి పాలెంలో అద్దెకు ఉంటున్నాడు. రమేష్ డీసీఎం డ్రైవర్. పని మీద బయటకు వెళ్లిన రమేష్ ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో లక్ష్మారెడ్డి పాలెం భారత్ పెట్రోల్ బంకు సమీపంలో విజయవాడ జాతీయ రహదారిని దాటేందుకు రోడ్డు పక్కన నిలిచి ఉన్నాడు. అదే సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ వైపు నుంచి ఎల్‌బీనగర్ వైపునకు వెళ్తున్న ట్యాక్సీ కారు వేగంగా వచ్చి రమేష్‌ని ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. హయత్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. భార్య ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## '42 శాతం' కోసం జేఏసీ ఏర్పాటుకు కార్యాచరణ


అభివాదం చేస్తున్న ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అనేక ఉద్యమాలకు వేదికగా నిలిచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే ఉద్యమానికి వేదిక కానుంది. సోమవారం ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యా దవ్ అధ్యక్షత వహించిన సమావేశంలో పలు విద్యార్థి సంఘాలు బీసీ ఉద్యమానికి మద్దతు తెలిపాయి. బీసీల సమస్యే ఈ దేశ సమస్య అని, మరో సామాజిక ఉద్యమానికి ఓయూ వేదిక కావలసిన అవసరం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు ఏకాభిప్రాయం తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ తరహాలో విద్యార్థి జేఏసీ ఏర్పాటు చేసి పల్లె పల్లెన ఉద్యమ ఆవశ్యకతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 15న ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్‌లో జరగబోయే "ఐక్య కార్యచరణ" సమావేశానికి అన్ని విద్యార్థి సంఘాలు, ప్రొఫెసర్లు, మేధావులు, కళాకారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకులు అంసా అధ్యక్షులు సైదులు, పొలిటికల్ జేఏసీ నాయకుడు నర్సింహ, నాయి బ్రాహ్మణ విద్యార్థి సంఘం అధ్యక్షులు రవి, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### బీసీ సంఘాల అత్యవసర సమావేశంలో..

బీసీ రిజర్వేషన్‌ల సాధనకు తెలంగాణ ఉద్యమం తరహాలో ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా అన్ని యూనివర్సిటీల బీసీ విద్యార్థి సంఘాల నాయకులతో కలుపుకొని ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు బీసీ సంఘాల నాయకులు ఉస్మానియా యూనివర్సిటీలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని నిర్మిస్తామని దీని కోసం త్వరలో అన్ని బీసీ విద్యార్థి, యువజన కుల, సంఘాలతో కలుపుకొని బీసీ జేఏసీ ఏర్పాటవుతుందన్నారు.